

# ఆలోచన ఆగిపోయిన క్షణం

పురాణపండ రంగనాథ్

"ఇలాంటి లోహం భూమ్మీద ఎక్కడా దొరకదు!"- డాక్టర్ రమేశ్ గట్టిగా అన్నాడు. మిగిలిన వారందరూ అతని వైపు ఆశ్చర్యంగా, ఆత్రంగా చూశారు. వారందరూ శాస్త్రవేత్తలే. అందరూ ప్రపంచ ప్రఖ్యాతి గడించినవారే. అసాధారణమైన ఒక లోహావశేషం గురించి పరిశీలించ డానికి సమావేశం అయినవారే.

వారిలో రమేశ్ లోహవిజ్ఞాన శాస్త్రవేత్త. చండీదాసు వృక్షశాస్త్రవేత్త. వీరిద్దరూ భారతీయులు. మిగిలినవారిలో బ్రిటిష్ జాతీయుడు క్రిస్టఫర్ పృథ్వీ భౌతిక శాస్త్రవేత్త. అమెరికా నా. సా. కేంద్రం అధికారి లూయీ ఎలక్ట్రానిక్స్ నిపుణుడు. ఇవనోవిచ్ రష్యన్ రోదసీ ఇంజనీరు. వీరేకాక ఇంకా పలుదేశాల నిపుణులు ఆ లోహావశేషాన్ని పరిశీలిస్తున్నారు.

అది బాణం ములుకులా ఉంది. వెండి రంగులో మెరుస్తోంది. అయితే ఎక్కడి నుంచి వచ్చిందో, ఏ కాలానికి చెందినదో, అది ఏ లోహమో వారు ఆచూకీ తీయాలి. అసలు ఆ లోహం ములుకు దొరికిన వైనం అంతా ఒక వింత కథ!

* * *

ఇవాల్టికి పదిరోజుల క్రితం నాటి మాట. అరకులోయలోని అరణ్యంలోకి ఒక ఆటవికుడు వేటకై వెళ్లాడు. ఎంత తిరిగినా అతనికి ఆ రోజు వేట జంతువు దొరకలేదు. ఇంటిదారి పట్టి నిరాశగా వెళ్ళిపోతున్న అతనికి మార్గ మధ్యంలో ఒక అడవి మృగం వేసిన రంకె వినబడింది. అది పౌరుషంతో వేసిన రంకె కాదు. పోరాడి. పోరాడి అలిసిపోయి నిస్పృహాయంగా ఉక్రోషంగా చేసిన ఛీత్కారం. ఆటవికుడు అటు పరిగెత్తాడు. అల్లంత దూరంలో అడవి మృగం ఒకటి యమయాతనపడుతూ కనిపించింది. అది గింగురులు తిరుగుతోంది. ఛీత్కరిస్తోంది. వెనుక కాలి పిక్కకు తగిలిన బాణం ములుకును విదిలించుకొనాలని వెనుక కాళ్ళను బలంగా వెనక్కు విసురుతోంది. ఎంత చేసినా ఫలితం శూన్యం. అది నేల కూలింది. గిరిజనుడు దగ్గరకు వెళ్ళేలోగానే అది మెడ వాలేసింది. ఆఖరి శ్వాస తీసుకొంది. ఆటవికుడు దాన్నే పరిశీలనగా చూస్తున్నాడు. అడవి మృగం శరీరం ఎర్రగా రక్తం ముద్దలా అయిపోతోంది. జీడిగింజల పొగలా నల్లగా ఉండే ఆ మృగం కరిగించిన రాగి ముద్దలా మెరుస్తోంది. శరీరం అంతలోనే కరిగిపోసాగింది.ముదురు బెల్లం పాకంలా పల్చనైన తారులా దాని శరీరంలోని ఎముకలు, పేగులు, మాంసం, చర్మం ఒకటేమిటి సమస్త అవయవాలు కరిగిపోతున్నాయి. ఆ మృగం చర్మం అయినా ఒలిచి నాలుగు రూకలు చేసుకోవచ్చని ఆశించిన ఆటవికుడికి నిరాశ కలిగింది. దాని కొమ్ములు కూడా మరిగి కరిగిపోయాయి. వాడలా ఆ వింత దృశ్యాన్ని చూస్తుండిపోయాడు. చివరకు అక్కడ ఒక లోహం ములుకు మిగిలింది. అది అచ్చం బాణం ములుకు లాగానే వుంది. కాని వెండి రంగులో మెరుస్తోంది. విషపు బాణాలు గురించి, నిప్పు బాణాలు గురించి ఆటవికుడికి తెలుసు.కాని ఇలా ఒక నిండు జీవాన్ని నిలువునా కరిగించివేసే యిలాంటి విషపు ములుకు గురించి అతనికి తెలియదు.' అందుకే అంత ఆశ్చర్యం! భయం! అయినా ఆ ములుకుని తీసుకోవాలనుకొన్నాడు. చేయి చాచాడు. అది వెచ్చటి కిరణాలు ప్రసరించింది. అయినా వాడిలో ఆశ చావలేదు. దగ్గర వున్న తోలుపటకాతో దానిని పైకి తీసి జాగ్రత్తగా తన తోలు సంచిలో వేసుకొన్నాడు. చచ్చిపోయిన తేలంటే ఎవరికి మాత్రం భయం వేస్తుంది! అలాగే శక్తిహీనం అయిన ఆ ములుకంటె ఆటవికుడికి క్రమంగా భయం పోయింది.

ఇంటికి చేరాడన్న మాటేకాని వాడికి అనుమానం పోలేదు. ఆ ములుక్కి మళ్ళీ ప్రాణం వస్తే తమ అందర్నీ కరిగించి వేస్తుందేమోనని వాడి భయం. అందుకే తెల్లవార్లూ వాడి కంటికి కునుకులేదు. కునుకు పడ్తే ఆ ములుకు ప్రాణం వచ్చి కదులుతున్నట్లు పీడకల వచ్చేది. తెల్లవారుతూనే వాడు పట్నం పోయాడు. మార్వాడీ షాపుల్లో దాన్ని అమ్మాలని చూశాడు. ఏ నగల వ్యాపారీ కూడా ఆ లోహం నాణ్యం కట్టలేకపోయాడు. అది గీటుకు వచ్చే లోహం కాదు. అసలు అది యిక్కడ తయారయిన లోహం అయితే కదా ఎవరైనా నాణ్యం కట్టేది. వాడికి అంతా అయోమయంగా ఉంది.

చివరికి ఒక మార్వాడీ వాడికి పది రూపాయలు ఇచ్చి ఆ ములుకు కొన్నాడు. దాన్ని వదిలించుకొన్నానన్న తృప్తితో ఆటవికుడు పది రూపాయలకే సంబరపడి వెళ్ళిపోయాడు.

వాడు అలా వెళ్ళాడో లేదో ఆ షాపుపై పోలీసుల దాడి చేశారు. అక్కడ స్మగ్లింగ్ వ్యాపారం బాగా జరుగుతోందని ఎన్నో ఫిర్యాదులు అందాక పోలీసు దేవుళ్ళకు ఇవాళ కుదిరింది. దాడి చేశారు. సోదా చేశారు. ఇంకేముంది ఆ వింత లోహం ముక్క వారి కంటపడింది. షాపు యజమాని ఆటవికుడి గురించి చెప్పాడు. ఆటవికుడు నగర పొలిమేరలు దాటకుండానే పట్టుపడ్డాడు. పోలీసులు వాడి వాఙ్మూలం తీసుకొన్నారు.ఆ తర్వాత కథ



పత్రికలకు ఎక్కింది. ఆ లోహం ముక్కలు శాస్త్రవేత్తలకు పరీక్ష అయింది. దాని ఆచూకీ తీయాలని వారు బుర్రలు బద్దలు చేసుకొంటున్నారు.

* * *

చివరికి ఆ జంతువు మరణించిన ప్రాంతాన్ని పరిశీలిస్తే మరి కొంత సమాచారాన్ని సేకరించవచ్చునని అందరూ ఒక నిర్ణయానికి వచ్చారు.

"అవును. మన పరిశోధనల రంగ స్థలం అదే"-అన్నారు శాస్త్రవేత్తలందరూ.

వారి కళ్ళల్లో అరకులోయలోని రమణీయ, గంభీర, భయానక దృశ్యాలు కదిలిపోతున్నాయి. అక్కడి సెలయేళ్ళు, రకరకాల జంతువులు, పిట్టలు, క్రిమికీటకాలు, పచ్చిక, లతలు, గుల్మాలు, శిలీంధ్రాలు, బదనికలు, ఫెరన్ మొక్కలు, చెట్ల మానులు, కొండ గుట్టలు- ఇవన్నీ ప్రకృతి పరిణామానికి భాష్యం చెప్పేవే. అన్నింటిలో అంగారిక, అనాంగారిక రసాయనాలున్నాయి. అవన్నీ కాల పరిణామానికి చరాచర జీవక్రమానికి సాక్ష్యం యిచ్చేవే!

* * *

నిశ్శబ్దం ఆవరించిన ఆ అడవిలో సెలయేటి ప్రవాహపు గలగల ధ్వని తప్ప శబ్దమే లేదు. పిచ్చి పిచ్చిగా విరబూసిన అడవిచెట్లు, మొక్కలు ఈ మనుష్య సంచారాన్ని పూలకళ్ళతో ఆశ్చర్యంగా చూస్తున్నాయి. చండీదాసు, లూయీ, ఇవనోవిచ్, మరికొందరు సహాయకులు చకచక ముందుకు నడిచిపోతున్నారు. సెలయేటికి అటుయిటు కొండగుట్టల వాలుల్లో వర్జిన్ ఫెరన్ మొక్కలు ముగ్ధంగా కనిపిస్తున్నాయి. పదహారేళ్ళ యువతి తలంటు పోసుకొని జుట్టు ఆరబోసుకొంటున్న ఆకృతులు, అవి. అది ఒక ప్రతిమా సౌందర్యం. భావుకుడైన శాస్త్రవేత్త ఆ ఫెరన్ మొక్కలకు వర్జిన్ ఫెరన్ అని పేరుపెట్టడంలో ఎంతో ఔచిత్యాన్ని పాటించాడు. ఆ సెలయేటి ప్రక్కనే తడినేలలో సిల్వర్ ఫెరన్, హీనస్ ఫెయిట్రాప్ మొక్కలు మెరుస్తున్నాయి. వాటి నిశ్శబ్ద జీవ వ్యాపారాల్ని మననం చేసుకొంటూ శాస్త్రవేత్తల బృందం సాగిపోతున్నది.

* * *

శిబిరంలో రమేశ్, క్రిస్టఫర్ రకరకాల పరీక్షలు జరిపారు. అడవి మృగం క్రింద పడి, కరిగిపోయిన నేలమీది, నేల లోపలి మట్టిని సేకరించి వారు చేసిన పరీక్షలు అన్నీ, యిన్నీ కావు. ఆఖరికి ఆ మట్టిని కరిగించి రకరకాల రసాయనాలలో కలిపి ఆచూకీ తీయాలనుకొన్నారు. ఫలితం లేకపోయింది. ఇద్దరికీ పట్టుదల స్థానంలో విసుగు ఎక్కువవౌతోంది.

ఎన్ని సంక్లిష్ట పరిశీలనలు జరిపినా ఆ లోహం ఉనికి, నిర్మాణాలకు సాక్ష్యం యిచ్చే ఒక్క 'క్లూ' కూడా దొరకలేదు. ఆఖరికి క్రిస్టఫర్ యిలా అన్నాడు.

"రమేశ్! ఇది ఏదైనా కాప్స్యూల్ ఏమో!" దీనిలో విష రసాయనాలు దట్టించి ప్రయోగించి ఉంటారు."

"ఇది మీరన్నట్లు కాప్స్యూల్ అయితే మనం జరిపిన రాక్షస ప్రయోగాలకు తునాతునకలై ఉండాలి" అన్నాడు రమేశ్.

"మరి ఇదేమిటంటారు?"- క్రిస్టఫర్ ప్రశ్న భూమి గుండ్రంగా ఉన్నదన్నట్లు మళ్ళీ మొదటి ప్రశ్న దగ్గరకే చేరారు వారు.

"ఇది ఎక్కడ నుంచి వచ్చిందో తెలిస్తే తప్ప మనం ఇంక ఏ నిర్ధారణా చేయలేం" రమేశ్ పెదవి విరిచాడు.

"ఏదైనా ఫ్లయింగ్ సాసర్ విడిభాగం ఏమో!" క్రిస్టఫర్ ప్రశ్నార్థకంగా చూశాడు.

"ఎగిరే పళ్ళాలు ఒట్టి భ్రమ అని శాస్త్రవేత్తలు సిద్ధాంతీకరించారు.ఆ మాటకు యిక అర్థం లేదిప్పుడు"రమేశ్ ఖండితంగా అన్నాడు.

"మరి ఏం చేద్దాం?"- క్రిస్టఫర్ అడిగాడు.


"మనవాళ్ళ దగ్గరకు వెళ్ళిపోదాం. వాళ్ళు ఎక్కడ ఉన్నదీ మనకు ఈ ట్రాన్స్మిటర్ ద్వారా తెలుస్తుంది"-అని రమేశ్ ఆ యంత్రాన్ని ఆన్‌చేసి చండీదాసు బృందం ఆచూకీ కనుగొన్నాడు. ఇక ఆలస్యంచేయక బయలుదేరారు.

భౌతికశాస్త్రం ఈనాడు విశ్వసిస్తున్న సిద్ధాంతాలు వర్తించని ద్రవ్యరాశి ఉందా? అది ప్రతిబింబ ద్రవ్యరాశా? కాంతి వేగాన్ని మించిన వేగంతో పయనించే ద్రవ్యరాశి లేదని విజ్ఞానశాస్త్రం చేసిన ప్రతిపాదన తప్పా? అంతరిక్షంలో ఆవిష్కారం అవుతున్న చీకటి బిలాల సంగతి యేమిటి?

అక్కడ ద్రవ్యరాశిని, కాంతినికూడా తమలో ఇముడ్చుకొనే ఆకర్షణ శక్తిఉంది, ఒక వేళ ఈ లోహం ముక్క అక్కడ నుంచి వచ్చిపడిందా? అందుచే దీనికి ఈ భౌతిక, రసాయనశాస్త్ర సూత్రాలు, ద్రవ్యరాశి సిద్ధాంతాలు వర్తించడంలేదా? రమేశ్, క్రిస్టఫర్‌ల ఆలోచనలు ఒక్కటే. కాని వారు మౌనంగా నడక సాగిస్తున్నారు.

* * *

ఎదురుగా కాకరపాదో? బీర పాదో? తెలియడంలేదు కాని, చిక్కగా అల్లుకుపోయిన ఒక పెద్ద పొద కనిపిస్తోంది. దగ్గరకు వెళ్ళే కొలదీ అది పొదకాదు పెద్ద చెట్టు అనిపిస్తోంది. దానికి ఆకులు బాగా విశాలంగా ఉన్నాయి. కాండం అంతా, ఆ మాటకువస్తే కొమ్మ



కొమ్మకూ, రెమ్మ రెమ్మకూ ఆకులే. కాండమే కనిపించని ఆకులు. చండీదాసు బృందం ఆ వింత చెట్టు సమీపానికి వచ్చింది. అది చెట్టే, కాని దాని నిండా లతలు పాకాయి. జానపద కథల్లో వర్ణించే దయ్యం చెట్టులా ఉందది. చండీదాసు తన వృక్షశాస్త్ర పరిజ్ఞానాన్ని నెమరు వేసుకొన్నాడు.

వేలెడు మందం ఉండే కాండానికి చివర భూమిపై పెద్ద పువ్వు పూసే రఫ్లీషియా అతనికి తెలుసు. పన్నెండేళ్ళకు ఒక్కసారి ఒక్కపువ్వే పూసే కురవంజి అతనికి తెలుసు. విపరీతంగా పూడలు దింపుకొనే మర్రి సంగతి అతనికి గుర్తే. అలాగే సెకండరీ థివెనింగ్‌లో అగ్రస్థానం పొందిన గానుగ చెట్టు అతనికి గుర్తే. దాదాపు పదివేల మొక్కల విలక్షణ లక్షణాలను అతను ఏకరువు


# న్యూట్రమూల్ శక్తి.

## ఛాంపియన్లు ఎంచుకునేది యిది.

న్యూట్రమూల్. సమృద్ధి అయిన అమూల్ పాలు, ఎంచిన మాల్ట్, ఆరోగ్యాన్నిచ్చే విటమిన్లు, పుష్టినిచ్చే ప్రోటీన్లు, అత్యవసరమైన ఖనిజాలు, ఉల్లాసాన్నిచ్చే చాక్లెట్... యివన్నీ గూడా బోర్న్‌విటా, బూస్ట్, మాల్టోవా కన్నా చాలా తక్కువ ధరలో మరో విషయం గుర్తుంచుకోండి. కేవలం న్యూట్రమూల్‌కే ఐ ఎస్ ఐ నాణ్యతముద్ర వుంది.




**మరింత పొడుగ్గా, బలంగా, పుష్టిగా అవడం ఎలా?**

కనివిని ఎరుగని శక్తినిచ్చే పుస్తకపు కానుక:

To: Nutramul, P.O. Box 10148, Bombay 400 001. oo

ప్రియమైన న్యూట్రమూల్,


దయయుంచి నాకు దారాసింగ్ గారి 'హైట్ ఇన్‌క్రీజ్ స్ట్రెంగ్త్ అండ్ ఫిట్‌నెస్' పుస్తకం పంపించండి. నేను రు. 1-50 పోస్టేజి స్టాంపులూ, న్యూట్రమూల్ 500 గ్రా. డబ్బా కొన్న క్యాష్ మెమోనీ జతపరుస్తూన్నాను. సరుకు సరుకు వున్నంతవరకే యీ కానుక అని నాకు తెలుసు.

పేరు ________ (పెద్ద అక్షరాలలో)

అడ్రసు ________

మార్కెట్ చేయువారు:
గుజరాత్ కో-ఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ లి.
ఆనంద్ 388 001.

daCunha/GCM/76/TL/82



పెట్టగలడు. కాని వాటిలో ఏ మొక్కా ఈ చెట్టుకు సరిపోలడం లేదు. అదేదో ప్రత్యేక తరహా మొక్కలా ఉంది. అది చెట్టు కాదు లత. కాదు పాదు, కాదు పొద, కాదు గుబురుగా పెరిగిన గడ్డి చెట్టు. అంటే దానికి అన్నిరకాల వృక్షజాతుల లక్షణాలున్నాయి. "ఎసోమాటిక్ ఇన్హెరిటెన్స్" ప్రక్రియద్వారా ఈ మొక్కను సృష్టించినట్లుంది. అంటే రకరకాల మొక్కల సాధారణ జీవకణాలను జీవ రసాయనిక పద్ధతులద్వారా సాంకర్యం చేసి మొక్కగా పెంచడం అన్నమాట.

చండీదాసు ఆ చెట్టు దగ్గరగా వెళ్ళబోయి ఏదో అనుమానం వేసి ఆగిపోయాడు. ఆ చెట్టుచుట్టూ మాంసాహారం తినే నెపెంథస్ మొక్కలున్నాయి. వాటి ఆకు చివర కూజా ఆకారాలున్నాయి. దానికి పైన మూతలున్నాయి. ఆ కూజా లోనికి పురుగు, క్రిమికీటకం ఏం వచ్చినా వెంటనే మూతపడిపోతుంది. ఈ చెట్టుక్కూడా మాంసాహారమొక్కల లక్షణం లేదు కదా? దగ్గరకు వెళ్తే ఆ తీగలతో తనను చుట్టివేయదు కదా, ఈ అనుమానం రావడంతో చండీదాసు ఆగిపోయాడు. మిగిలినవారు ఆత్రంగా బైనాక్యులర్స్‌లో అటు యిటు చూస్తున్నారు.

ఇంతలో వారికి బాణం రివ్వున వస్తున్న ధ్వని సన్నగా వినిపించింది. అటు తిరిగారు. లోహం ములుకు ఒకటి రివ్వున రావడం కనిపించింది. అందరూ అటూ యిటూ తప్పుకొన్నారు. ఆ ములుకు 'జర్' మని ధ్వని చేస్తూ, గిర గిర తిరుగుతూ వేగంగా వెళ్ళి ఎదురుగా వున్న పెద్ద మానులో దిగబడిపోయింది. అందరూ ఆ చెట్టు వైపు తిరిగారు.

ఆ చెట్టు అటు యిటు వూగింది. పెద్ద గాలికి వూగినట్లు వూగిపోయింది. వేళ్ళతో సహా పెకలించుకొని పడిపోయింది. అది క్రమంగా కరిగిపోసాగింది. ముందు మైనంలా అయింది, తర్వాత తారుముద్దలా అయింది. ఆ తర్వాత నల్లటి నీళ్ళల్లా కరిగింది. అంతా నిమిషాలమీద జరిగింది. ఇదేం విషం ములుకో.

అందరి ముఖాలలో ఆశ్చర్యం, భయం వడుగు పేకలుగా పేరుకొన్నాయి. ఆ చెట్టు గుబురులోనుంచే ఎవరో ఈ ములుకుని ప్రయోగించారని వారు రూఢి చేసుకొన్నారు. ఇంకా ఆలస్యం చేస్తే తమపై అటువంటి విషం బాణాల ప్రయోగం జరగవచ్చునని చండీదాస్ తన దగ్గర ఉన్న లేసర్ ఆయుధం తీశాడు. ఆ చెట్టు చుట్టూ ప్రాంతంపై ఆ కాంతి ప్రసరింపజేశాడు. క్షణకాలంలో లేసర్ తీక్షణ జ్వాలలకు ఆ చెట్టు, ఆ పరిసరాల లోని గుబుర్లు కాలిపోయాయి. అంత వరకు భయం కలిగించిన ఆ వాతావరణం యిప్పుడు ఎంతో కాంతిగా ఉంది. భయం పోయింది. ముందుగా వెళ్ళవచ్చుననే చొరవ అందరిలో కలిగింది.

ముసురు పట్టిన వేళ ఆవరించిన చీకటి తొలగిపోయి, సన్నటి కాంతివచ్చినట్లుంది ఆ వాతావరణం. అక్కడ మనుష్యులు ఎవరూ లేరు. ఆశ్చర్యం! కాని అంతరిక్ష నౌక ఒకటి ఉంది. మరిగిన మట్టి మెరుస్తున్నట్లు ఆ నౌక కాంతులీనుతోంది. నాలుగు స్టీలు కాళ్ళపై అది నిలిచి ఉంది. నాలుగు ప్రక్కల తుపాకి గొట్టాలున్నాయి. వాటిలోనుంచి లోహం ములుకు వచ్చి ఉంటుందని చండీదాసు బృందం భావించింది.

వారి అనుమానాలు తీరాయి, భయాలు తొలిగాయి. ఇక మిగిలింది- ఆ అంతరిక్ష నౌకను తనిఖీ చేయడం. ఎవరు ముందు వెళ్ళాలా అనుకొంటూనే అందరూ ఒకేసారి నాలుగువైపుల నుంచి నౌక కాళ్ళ మీది మెట్లమీదుగా పైకి వచ్చేశారు.

అది ఆధునిక రోదసీ కేంద్రంవలె ఉంది. చక్కటి అమరిక, చక్కటినమూనా. లోపల ఎవరూ లేరు. అది అక్కడకు ఎప్పుడు వచ్చి దిగిందోతెలీదు. ఆ సంగతి తేలుద్దామని చండీదాసు బృందం లోపల అంతా గాలించసాగింది. లోపల యంత్రాలన్నీ స్తంభించిపోయిఉన్నాయి. ఇంధనం టాంకు ఖాళీగా ఉంది. విద్యుత్ప్రసారం లేదు. ఈ అంతరిక్ష నౌక ఏ సుదూర గ్రహం నుంచో వచ్చి యిక్కడ పడిపోయి వుండాలి. అయితే భూగోళంమీది రాడార్ల కనుగప్పి యిది ఎలా రాగలిగింది. దీని సంగతి ఏ ఖగోళ శాస్త్రవేత్త, ఏ రోదసీపరిశోధనా కేంద్రమూ గుర్తించనేలేదా? ఏమో తెలియదు. వారందరూ ఆత్రంగా ఆ నౌకలో తిరగసాగారు. నాలుగు కాళ్ళపై దీర్ఘచతురస్రాకారపు పేటిక. దానిపై అర్ధవృత్తాకారపు టోపీ ఉన్న రోదసీ నౌక అది.

నౌకలో నిర్జీవంగా ఉన్న ప్రతి వస్తువునూ వారు పరిశీలించసాగారు. నౌకలో ఎక్కడా ఏ వివరం తెలిపే సమాచారం లేదు. కంప్యూటర్లు, ఎలక్ట్రానిక్ యంత్రాలు అన్నీ ఆగిపోయాయి. పైగా బూజు పట్టాయి. వాటి నిర్మాణాన్ని చూసినట్లయితే భూగోళంమీద నిర్మితం అయినట్లే అనిపిస్తోంది.

అలా వెతుకుతూ, వెతుకుతూ వారు నౌక మధ్యలోకి వచ్చేశారు. అది అండాకారంగా ఉన్న ప్రత్యేక మందసం. దానిలోని యంత్రాలు ఆగిపోయి ఉన్నాయి. పనిచేయడం లేదు. కాని అక్కడ ఒక మరమనిషి కళ్ళు మాత్రం వెలుగుతూ కనిపించాయి. అంటే అది పని చేస్తోం



దన్న మాట! చండీదాస్ వెంటనే ఎలక్ట్రానిక్స్ నిపుణుడు లూయీని పిలిచాడు. పరధ్యానంగా అటు యిటు చూస్తున్న లూయీ చండీదాసు కేకవిని అతని దగ్గరకు వచ్చాడు.

"లూయీ! ఇదో మరమనిషి. కళ్ళు చూశావా? మెరుస్తున్నాయి. అంటే యిది పని చేస్తోందన్న మాట. ఇక నీ విజ్ఞానాన్ని ఉపయోగించి ఈ రహస్యం ఛేదించు"- అన్నాడు చండీదాసు. అతని మాటలు వింటూ అందరూ అక్కడ గుమిగూడారు. ఆ మరమనిషి వైపు చూశారు.

అది సరిగ్గా మనిషంత పొడవు వుంది. బలమైన స్టీలు మరలకాళ్ళు. నాజూకైన మరచేతులు. దీర్ఘచతురస్రాకారపు పెట్టెలా పొట్ట. చతురస్రాకారపు పెట్టెలా తల. మెరిసే కళ్ళు. గుండెలపై స్విచ్చిలు రేడియం రంగులో మెరుస్తున్నాయి. శరీరం అంతటికీ మెదడు ఎంత ముఖ్యమైనదో ఈ రోదసీ నౌకకు ఈ మరమనిషి అంత ముఖ్యమైన వాడన్నమాట. అందుకే నౌకలోని అన్ని యంత్రాలు, అన్ని కంప్యూటర్లు, మరమనుషులు శక్తిహీనులైపోయినా యిది మాత్రం సజీవంగా ఉంది. దీనిని విడగొట్టి పరిశీలిస్తే ఏదైనా ఆచూకీ దొరకవచ్చు అనుకొన్నాడు లూయీ.

తన విజ్ఞానాన్ని ఉపయోగించే అవకాశం వచ్చింది కదా అన్న ఆనందంతో లూయీ ఆ మరమనిషి దగ్గరకు వచ్చాడు. ఏమీ చలనం కనిపించలేదు. కళ్ళుమాత్రం రేడియం రంగులా మెరుస్తున్నాయి. చేతికి 'గ్లావ్స్' తొడుక్కొని లూయీ ఆ మరమనిషి శరీరం అంతా తడిమాడు. ఏమీ చలనం లేదు. రాతిబొమ్మలా ఉన్నాడు ఆ మరమనిషి. దానివల్ల ప్రమాదం ఏం లేదని లూయీ రూఢి చేసుకొన్నాడు.

లూయీ మరమనిషి గుండె మీద స్విచ్చిలు చూశాడు. ఒక స్విచ్చి మాత్రం 'ఆన్' చేసి ఉంది. మిగిలిన స్విచ్చిలు కొన్ని 'ఆన్' అయి వున్నాయి, కొన్ని ఆఫ్ అయి వున్నాయి. కొన్ని అటు యిటు కాకుండా ఉన్నాయి. లూయీ ఒక స్విచ్చిని ఆఫ్ చేశాడు. కళ్ళు వెలగడం మానివేశాయి. మరల ఆన్ చేశాడు. కళ్ళు వెలిగాయి. మిగిలిన స్విచ్చిలన్నీ అటు యిటూ ఆడించాడు టపటప. మరమనిషిలో మార్పేం కనిపించలేదు.

* * *

ఆ మరమనిషి కీలుకీలునా విప్పాడు లూయీ. పొట్ట భాగంలో అన్నీ ఎలక్ట్రానిక్ పరికరాలే. గుండె భాగాలల్లోను అంతే. తలపై రేకు విప్పాడు. అందులో ఒక పుస్తకం ఒక రేకుకు 'రివిట్' చేసినట్లు అతుక్కొని ఉంది. అంతకు మించి ఆ మరమనిషిలో వింత పరికరం ఏమీ కనిపించలేదు. లూయీ ఆత్రంగా ఆ పుస్తకాన్ని చూశాడు. జాగ్రత్తగా బయటకు తీశాడు. అది లోహపు రేకుల పుస్తకం. రేకులు తిప్పాడు. దానిలో టైపు చేసినంత అందంగా అక్షరాలున్నాయి. ఆ పుస్తకం తమ అన్ని సందేహాలకు సమాధానం చెపుతుందని నిశ్చయించుకున్న లూయీ దాన్ని తీసుకురాబోయి మరమనిషి కళ్ళవైపు చూశాడు. కళ్ళు వెలగడం లేదు. స్విచ్ వేసి చూశాడు. ఆర్పి చూశాడు. కళ్లు వెలగలేదు. అంతవరకు జీవకళ కన్పించిన ఆ మరమనిషి కళ్ళలో చీకటి అలముకొంది. అంటే అది చచ్చిపోయింది.

లూయీ ఆ పుస్తకాన్ని పట్టుకొని గబగబా మెట్లుదిగి సహశాస్త్రవేత్తల దగ్గరకు వచ్చాడు. ఆ పుస్తకం సంగతి చెప్పాడు.

* * *

[చండీదాసు ఆ పుస్తకంలోని పుటలు తిరగవేస్తూ చదువుతూంటే అందరూ ఆశ్చర్యంగా వింటున్నారు.]

ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్తలు యాభై సంవత్సరాల క్రితం నిర్మించిన ఒక అసాధారణ అంతరిక్ష నౌక ఇది. దీనిలో అన్నీ మరమనుషులే. అనంత విశ్వాంతరాళంలోని ప్రతిబింబ ద్రవ్యరాశి గురించి అన్వేషించడానికై ప్రయోగించిన అంతరిక్ష నౌక ఇది. నౌక పయనిస్తుండగా సిరియస్ నక్షత్రమండల తీరంలో ఒక అనూహ్య విస్ఫోటం జరిగింది. ఈ నౌక గతి తప్పింది. కక్ష్య మారిపోయింది.. మరమనుషులందరూ చచ్చిపోయారు. అయితే అందరికన్నా తెలివైన "రొబొ-అసిమోవ్" మాత్రం జీవించి ఉన్నాడు.(ఆధునిక రొబొటిక్స్‌కు అసిమోవ్ స్రష్ట అని మీ అందరికీ తెలుసు. అందుకే ఈ రొబొకి ఆ శాస్త్రవేత్త- రచయిత పేరును పెట్టారు.)

ఈ అంతరిక్ష నౌకకు అతను మెదడు వంటివాడు. అతను అంటే మరెవరో కాదు- నేనే. ఈ కథను వ్రాస్తున్న నేనే. వ్రాయడం అంటే మీ లాగా పెన్నుతో వ్రాయడం కాదు. నేను చూసిన అంశాలు ముఖ్యమైనవైతే వెంటనే నా ఎలక్ట్రానిక్ మెదడు ఈ వింత లోహం కాగితాలపై ఆ సంగతులన్నీ ముద్రిస్తుంది. ఇక కథ చెపుతాను.

ఈ మరమనిషికి సొంతంగా ఆలోచించే శక్తి ఉంది. అందుకే సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రయోగశాలలోని మధ్య భాగంలోకి వచ్చేశాడు. మిగిలిన అన్ని యంత్రాలు, కంప్యూటర్లు, మరమనుషులు చచ్చిపోయినా ఈ రొబొగారు జీవించి ఉన్నారు.

అంతరిక్ష నౌక నక్షత్ర వీధులు వది

లింది. గ్రహాంతర సీమలు కదిలింది. గ్రహశకల వలయాలు దాటి అది ఎటు వెళుతుందో ఎవరికీ తెలియదు. భూతల కేంద్రాలన్నింటికీ దానితో సంబంధాలు తెగిపోయాయి.

ఏ నక్షత్ర వీధులగుండా నౌక తిరోగమిస్తున్నదో తెలీదు. కాని హఠాత్తుగా నౌకకు కుడివైపున పెద్ద జ్వాలలు చెలరేగాయి. క్షణాలమీద ఆ ప్రాంతంలో రెండు బాణం ములుకులు ఏర్పడ్డాయి. మంట చల్లారింది. రొబొ అసిమోవ్ ఆ ములుకుల్ని పరిశీలించాడు. ఏం చేయాలో తోచక వాటిని అక్కడి తుపాకి గొట్టాలలో పారవేశాడు.


గమ్యం తెలీకుండా నౌక ప్రయాణం సాగిపోతోంది. ఒకనాటి రాత్రి నౌక యిక్కడ పడిపోయింది. ఏదో ఉల్కపడిందనుకొని వుంటారు జనం. అసలు ఈ నౌక గురించి చాలా మంది మరిచేపోయారు. అందుకే ఇదేమైనదో ఎవ్వరూ పట్టించుకోలేదు.

ఆ లోహం ములుకులు గురించి, అవి ఏర్పడడానికి ముందు చెలరేగిన మంటలు గురించి లెక్కలు వేస్తూనే ఉన్నాను.

ఒకసారి యిటువైపు అడవి మృగం ఒకటి వచ్చింది. అది స్వైర విహారం చేస్తోంది. ఇంతలో నా ఎదురుగా ఉన్న తుపాకిగొట్టంలో సంచలనం కానవచ్చింది. నా కళ్ళు అదే చూస్తున్నాయి. ఆ గొట్టంలోని ములుకు గిర్రున పైకివచ్చి వేగంగా దూసుకుపోయి ఆ అడవి మృగం పిక్కలో కూరుకుంది. ఆ తర్వాత కథ మీకు తెలిసిందే. ఈ వింత లోహానికి జీవ, జంతు చలనాన్ని పసిగట్టి హతమార్చే విలక్షణ శక్తి ఉందని రూఢి అయింది.ఈ లోహం ఎలా తయారయిందో తెలీదు. దీనికి విషధర్మం ఎలా వచ్చిందో అంతుపట్టదు కాని, రొబొ-అసిమోవ్ కొన్ని లెక్కలుకట్టి, అంచనాలు వేసింది.

ఇంతవరకు చదివి చండీదాసు అందరివైపు చూశాడు. శాస్త్రవేత్తలందరిలో ఆసక్తి, ఆశ్చర్యం సమపాళ్ళలో కనిపిస్తున్నాయి. చండీదాసు మరల చదవడం ప్రారంభించాడు.

ఈ వింత లోహం 'బయో-ప్లాస్మిక్' చర్యవల్ల ఉద్భవించి ఉంటుందని భావిస్తున్నాను. జీవ రసాయనాలను కరిగించివేసే విషధర్మం దీనికి ఉంది. ఒకసారి పని




చేసిన ములుకు మరి పని చేయదు.

నక్షత్ర వీధులలో అవతరించిన ఈ లోహంలోని ద్రవ్యరాశిలో ప్రతిబింబ ద్రవ్యరాశి అణువులు యిమిడిపోయాయని భావిస్తున్నాను.

ఈ లోహం తయారయిన మూలకంలో ప్రతిబింబ శక్తిరాశి [యాంటి ఎనర్జి] యిమిడిపోయిందని నా అంచనా. అందుచేత దీనిని విచ్ఛేదించగలిగితే యాంటి-ఎటామిక్ ఎనర్జీ విడుదల అవుతుంది. ఈ రహస్యాన్ని మీరు ఛేదించుకొన్నట్లయితే న్యూట్రాన్ బాంబు వంటి మారణాయుధాల బెడద ఉండదు.

ఇక్కడ మీకు ఒక వుదాహరణ చెప్తాను: వాతావరణంలోని 'నత్రికత్రయామ్ల జనిదం' మెరుపులు వచ్చినప్పుడు వెలువడే అధిక ఉష్ణోగ్రత వద్ద వర్షపు నీటితో కలిసి నత్రికామ్లం అయి భూమిలో చేరి మొక్కలకు ఉపకరిస్తోంది. అలాగే ఈ వింత లోహం ఏర్పడిన తీరు అని నా అంచనా.అయితే యిది బయో-ప్లాస్మిక్ ప్రక్రియ, ఎలక్ట్రాన్లు, ప్రోటాన్ల వంటి జడచైతన్య రేణువులకు ప్లాస్మాస్థితి కలిగించి, జీవధాతు ధర్మాన్ని ఆపాదించగలిగితే ఈ వింత లోహం నిర్మితం అవుతుందని నా అంచనా. నిర్జీవ పదార్థాల నుంచి జీవాణువులు అంకురించిన బయో-ప్లాస్మిక్ స్థితి ఇది. ఇక్కడ ద్రవ్యరాశికి, జీవ మూలధాతువుకు భేదం కనిపించదుకదా!

ఆలోచించండి....ఆ తర్వాత పుటలో కొంత ఖాళీ ఏర్పడింది. అంటే రొబొ-అసిమోవ్ కళ్ళు ఆర్పివేసినప్పుడు కంప్యూటర్ సంబంధాలు తెగిపోయి ఉంటాయి. అందుకే అక్కడ ఖాళీ ఉండి తర్వాత మరల స్విచ్చి ఆన్‌చేసినప్పడు ఈ కథ రికార్డయిందన్న మాట. చండిదాసు మరల చదవసాగాడు.

ఈ ఫార్ములా విడగొట్టండి- అన్న అక్షరాల తర్వాత గజిబిజిగా అంకెలు, బీజాంకాలు, ఫార్ములాలు ఉన్నాయి. అవి సరిగా అర్థం కావడం లేదు. ఆ తర్వాత నాలుగు వాక్యాలు ఉన్నాయి.

ఇదివేగాన్ని ఘనీభవింపచేసేఫార్ములా, మూడు కొలతలుగల మనిషి నాలుగవ కొలత అయిన కాలాన్ని బంధించే ప్రక్రియ ఇది. ఇక్కడ స్థలకాలాలకు రూపం వస్తుంది. అంటే కాంతివేగాన్ని కాంతివేగంతో గుణించి, అణుభారంతో భాగించి ........ ××....×....×....
×....×...÷××÷×××...×
అంతా అయోమయంగా ఉంది ఆ ఫార్ములా.

అక్కడ అణువులు లేవు. అణుగర్భంలోని ప్రోటాన్లు లేవు. ఎలక్ట్రాన్లు లేవు. అంతా శక్తి పుంజం. శక్తి ప్రసారానికి సంబంధించిన అంకెలు....

చండీదాసు పుస్తకం మూసివేశాడు. అందరిలో ఆశ, నిరాశ వెలుగుతున్నాయి.

అణు విధ్వంసక శక్తిని శాంతపరిచే కొత్తఫార్ములా దొరికిన ఆశ.ఆ ఫార్ములా రహస్యం తెలియని నిరాశ వారిది.

రొబొ-అసిమోవ్ తన మెదడు పుస్తకంలో వ్రాసుకొన్న ఆ ఫార్ములాకు రూపం ఇవ్వగల సామర్థ్యం అక్కడ ఎవ్వరికీ లేదు. అసలు ఆ రహస్యం విడగొట్టడానికి మరల అటువంటి మరమనిషి రావాలేమో!

అంటే మనిషి ఆలోచన ఆగిపోయిందా? ఆగిపోలేదూ మరి- అణు విధ్వంసకశక్తి అందివచ్చాక,న్యూట్రాన్ బాంబుకు ప్రాణం పోశాక మనిషి ఆలోచన ఆగిపోయింది.

ఇక మర మెదడులే ఆలోచించాలి. మనిషి మెదడులోని జీవ రసాయనాల సృజనాత్మక చైతన్యం ఇంకిపోతోందా? మనిషి నిర్మించిన ప్లాస్మిక్- ఎలక్ట్రానిక్ చైతన్యం నిండిన కంప్యూటర్లు కాల్పనిక సూత్రాలను శాస్త్రబద్ధం చేస్తాయా?విజ్ఞానవేత్తలందరిలో ఈ ప్రశ్నలే కదులుతున్నాయి, వారిలో ఆలోచన ఆగిపోయిన క్షణం అది!